క్లుప్తంగా

మంత్రిని కలిసిన నాయకులు

ఇల్లెందు: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఇల్లెందు కాంగ్రెస్ నేతలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని పొంగులేటి స్వగృహంలో ఆయనను కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పింగళి నరేష్ కుమార్, ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, చిట్టిబాబు, పడిదల నవీన్ తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

ఇల్లెందు: ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, మండల రాము, పులి సైదులు, రాంబాబు, పూనెం సురేందర్, మాజీ సర్పంచ్ కల్తీ పద్మ చేతుల మీదుగా మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు.

ప్రతీ ఇంటిని సర్వే చేయాలి

పాల్వంచరూరల్: ఇందిరమ్మ హౌజింగ్ సర్వేలో ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా ప్రతీ ఇంటిని సర్వే చేయాలని హౌజింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి ఎంపీఓ బి.నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేశ్వరీ, ఏపీఓ పారంద్ల రంగా, ఈసీ పుల్లయ్య పాల్గొన్నారు.

పనిదినాలు కల్పించాలి

పాల్వంచ: ఎన్ఎండీసీ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస పనిదినాలు చూపించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా కోరారు. మంగళవారం స్థానిక ఎన్ఎండీసీ అధికారులు ఎం.శ్రీధర్, డి.రాజులను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న సుమారు 50 మంది కాంట్రాక్ట్ కార్మికులకు వేతన దినాలు సరిపోవడం లేదని, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. స్పందించిన అధికారులు నెలకు కనీసం పది రోజులు పని ఇస్తామని తెలిపారు.


బాధ్యులపై చర్యలేవీ?

పాల్వంచరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అవకతవకలపై ఇరవై రోజుల క్రితం విచారణ చేసినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని రెడ్డిగూడెం సహకార సొసైటీ కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసినట్లుగా తప్పుడు పత్రాలతో మిల్లులకు ధాన్యం తరలించారని కొందరు డీసీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో గతనెల 16న ప్రత్యేకాధికారి అరుణ్‌కుమార్ విచారణ జరిపారు. ఆపై ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడంతో రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అవతవకలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫైలేరియా గుర్తింపు సర్వే

టేకులపల్లి: ఫైలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ ఆదేశానుసారం సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తావుర్యతండాలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఇల్లందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్‌వైజర్ నాగుబండి వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

ఇల్లెందురూరల్: విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీ భూపేష్‌నగర్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి సందీప్‌కు స్థానికులు మంగళవారం వినతపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి అవసరాల కోసం మరో నీటిట్యాంకు ఏర్పాటు చేయాలని, వీధులలో పిచ్చిమొక్కలు తొలగించాలని, అంగన్‌వాడీ పాఠశాలకు పక్కాభవనం నిర్మించాలని కోరారు. చందావత్ రమేష్, వాంకుడోత్ విజయ్, అశోక్, కోటేష్, రాజేష్, అనిల్, వంశీ పాల్గొన్నారు.

టిప్పర్ ఓనర్ల నిరసన

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టు నుంచి టిప్పర్ అసోసియేషన్ వాహనాలకు ఇచ్చే బొగ్గు లోడింగ్ పెంచాలని టిప్పర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓనర్లు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు బొగ్గు లోడింగ్ తగ్గించడాన్ని నిరసిస్తూ మంగళవారం పెట్రాంచెలక స్టేజీలో టిప్పర్లను నిలిపి నిరసన తెలియజేశారు. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, టేకులపల్లి సీఐ టి.సురేష్, బోడు ఎస్ఐ పి.శ్రీకాంత్ సంఘటనా స్థలానికి వెళ్లి టిప్పర్ ఓనర్ల సమస్యలు తెలుసుకుని కేటీసీ ప్రాజెక్టు ఆఫీసర్‌ని పిలిపించారు. అసోసియేషన్ నాయకులతో చర్చలు జరిపిన సింగరేణి అధికారులు సానుకూలంగా స్పందించడంతో ఆందోళన విరమించారు.

కొబ్బరికాయ కొనలేం!

- పెద్దమ్మగుడి వద్ద ఒక్కో కొబ్బరికాయ రూ.50
- వామ్మో.. అంటున్న భక్తులు
- పట్టించుకోని ఆలయ అధికారులు



పెద్దమ్మగుడి వద్ద కొబ్బరికాయల దుకాణం

పాల్వంచరూరల్: పెరిగిన కొబ్బరికాయల ధరలతో భక్తులు తల్లీ ధరలు తగ్గించేలా చూడమ్మా.. అని పెద్దమ్మ తల్లిని వేడుకుంటున్నారు. ఏ శుభకార్యమైనా మొదట కొబ్బరికాయ కొట్టడం ఆనవాయితీ. ఇంట్లో ఏ వేడుక అయినా.. ప్రారంభోత్సవమైనా.. గుడిలో మొక్కు తీర్చుకోవాలన్నా.. ఏ పూజ చేయాలన్నా.. ఎన్ని నైవేద్యాలు సమర్పించినా చివరికి కొబ్బరికాయ కొడితేనే పనులు ప్రారంభించేది. అందుకే ఆధ్యాత్మికంగా కొబ్బరికాయకు అంతటి ప్రాధాన్యం ఉంది.

ఇంతటి ప్రాధాన్యం ఉన్న కొబ్బరికాయల ధరలు కొండెక్కాయి. రెండు నెలల క్రితం ఒక్కో కొబ్బరికాయ రూ.20 అమ్మిన వ్యాపారులు ఇటీవల ఏకంగా రూ.50 చొప్పున విక్రయిస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం, లక్ష్మీదేవిపల్లిలోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయం వద్ద కొబ్బరికాయ వ్యాపారులు ఒక్కో కొబ్బరికాయను రూ.50 చొప్పున అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేంటని అడిగితే ఇక్కడ ధరలు ఇంతే స్వామి అంటూ.. వ్యాపారులు సమాధానం చెప్పున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దమ్మతల్లి ఆలయానికి చెందిన దుకాణాలను అద్దెకు తీసుకున్న వ్యాపారులు మాత్రమే కొబ్బరికాయలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని భక్తులు తెలిపారు. అదే గుడి సమీపంలోని ప్రైవేట్ కొబ్బరికాయల దుకాణదారులు, పాల్వంచ, కొత్తగూడెంలోని వివిధ ఆలయాల వద్ద రూ.30లకు విక్రయిస్తున్నారు. గుడికి చెందిన దుకాణాల్లో మాత్రమే కొబ్బరికాయల ధరలు అధికంగా ఉన్నాయని ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని భక్తులు అంటున్నారు. భక్తితో ఇక్కడి దాకా వచ్చి తప్పని పరిస్థితిలో కొనుగోలు చేయాల్సి వస్తోందని అంటున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి కొబ్బరికాయల అధిక ధరల విక్రయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి దిగుమతి..

పాల్వంచ ప్రాంతంలోని పెద్దమ్మతల్లి ఆలయంతో పాటు ఇతర ఆలయాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉభయ గోదావరి జిల్లాలోని కాకినాడ, పాలకొల్లు, చిన్నతిరుపతి, జంగారెడ్డిగూడెం, యానం తదితర ప్రాంతాల నుంచి కొబ్బరికాయలు ప్రతీవారం వాహనాల్లో ఇక్కడికి వస్తుంటాయి. ఇందులో చిన్న, పెద్ద రెండురకాల సైజు కొబ్బరికాయలను వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు. పెద్దమ్మగుడి వద్ద కొబ్బరికాయ దుకాణదారులు చిన్న, పెద్ద సైజుల పేరుతో భక్తులను దోపిడీ చేస్తున్నా ఆలయ ఈఓ పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారని భక్తులు చెబుతున్నారు.

ఇంత ధరలు ఎక్కడా లేవు...



పెద్దమ్మతల్లి దర్శనం కోసం వచ్చాను. ఇక్కడి దుకాణాల్లో కొబ్బరికాయ ఒక్కోటి రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఇంత ధరలు ఏ గుడి వద్దా లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయం వద్ద కొబ్బరికాయల ధరలు తగ్గించేవిధంగా చర్యలు తీసుకోవాలి. – విజయ, హైదరాబాద్, భక్తురాలు

రూ.25 చొప్పున విక్రయించాలి..



గుడి వద్ద కొబ్బరికాయల ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పెద్దమ్మతల్లి ఆలయం వద్ద కొబ్బరికాయల ధరలను పెంచి విక్రయిస్తున్నారు. ఒక్కొ కొబ్బరికాయ రూ.25 చొప్పున అమ్మేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. – శ్రీలత, జగిత్యాల, భక్తురాలు

చర్యలు తీసుకుంటాం...



ఆలయం వద్ద వ్యాపారులు కొబ్బరికాయలను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే, ఈ విషయంపై వ్యాపారులతో మాట్లాడి కొబ్బరికాయలను అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటాం. – ఎస్.రజనీకుమారి, ఈఓ, పెద్దమ్మగుడి

ఫిక్స్‌డ్ వేతనం చెల్లించండి..



మాట్లాడుతున్న నబీ

ఇల్లెందు: ఆశా కార్యకర్తలకు పనిభారం తగ్గించి ప్రతీనెల ఫిక్స్‌డ్ వేతనం అందజేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఇల్లెందులో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకుడు ఎస్ఏ నబీ మాట్లాడుతూ... ఈ నెల 10న స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ఇల్లెందు ఏరియా ఆస్పత్రి, రొంపేడు, కొమురారం, గుండాల, ఆళ్లపల్లి, సులానగర్ ఆస్పత్రి పరిధిలోని ఆశా కార్యకర్తలంతా జరిగే ర్యాలీకి హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, వజ్జ సుశీల, చీమల రమణ, గంధసిరి ఉమాదేవి, సుగుణ, హైమ, మల్లేశ్వరి, లక్ష్మి, సరిత, సునీత, ఆదిలక్ష్మి, విజయ, చంద్రకళ, యశోద, వెంకటలక్ష్మి, పూర్ణ, సుజాత పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు పోరాడుదాం..

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడానికి ప్రజలను కలుపుకొని భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం సీనియర్ నాయకుడు మాజీ ఎంపీ మిడియం బాబూరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మంచికంటి భవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరం కనకయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే హామీలు అమలు చేస్తామన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏదీ అమలు కావటంలేదన్నారు. మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, ఎం.జ్యోతి, లిక్కి బాలరాజు, కే.బ్రహ్మాచారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి..

ఇల్లెందురూరల్: ఉపాధి పనులలో కూలీల సంఖ్య పెరిగే విధంగా వారిని ప్రోత్సహించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల వారీగా కూలీల నుంచి డిమాండ్ పత్రాన్ని స్వీకరించి అందుకు అనుగుణంగా పనులు కల్పించాలని చెప్పారు. ప్రధానంగా క్యాటిల్ షెడ్, నాడెపు కంపోస్టు పిట్ తదితర ప్రజలకు ఉపయోగపడే పథకాలపై విస్తృతంగా ప్రచారం కల్పించి సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. గ్రామపంచాయతీలలో ప్రసుత్తం ఏర్పాటు చేస్తున్న నర్సరీలలో ప్రధానంగా మునగ మొక్కల సంఖ్య ఎక్కువగా పెంచాలని సూచించారు.

ట్రక్ ఆపరేటర్ శిక్షణ

టేకులపల్లి: సింగరేణి ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో ఓపెన్‌కాస్టు నిర్వాసితులు, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువకులకు వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్‌గా శిక్షణ ఇస్తున్నట్లు ఇల్లెందు ఏరియా డీజీఎం పర్సనల్ మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ గూడ్స్ వెహికిల్ లైసెన్స్‌పై మూడు సంవత్సరాల అనుభవం కలిగిన యువకులకు ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 8 వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువకులు ఈనెల 15వ తేదీలోపు ఇల్లెందు ఏరియాలోని ఎంపీటీసీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

స్థానిక ఏరియాల్లోనే అప్రెంటిస్ షిప్ ఇవ్వండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొన్నేళ్లుగా ఏ ఏరియాలోని అభ్యర్థులకు ఆయా ఏరియాల్లోనే అప్రెంటిస్‌షిప్ ఇస్తోంది. కానీ ఈ ఏడాది తాజాగా కౌన్సెలింగ్ పెట్టి వివిధ ఏరియాల వారికి కేటాయించటం సరైంది కాదని, పాత పద్ధతినే కొనసాగించాలని కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజుకు ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, అనిల్, సాగర్, సత్తార్‌పాషా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వివిధ ఏరియాల జీఎం కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెంలోని కార్మికుల అడ్డాలలో జరిగిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఎం.చంద్రశేఖర్, కే.నరసింహా, వినోద, అనసూర్య, శేఖర్, లక్ష్మి, శాంత పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ లెక్కలు చెప్పండి..



మాట్లాడుతున్న యాకుబ్‌షావలీ

ఇల్లెందు: సింగరేణిలో పని చేస్తున్న అద్దె వాహనాల డ్రైవర్ల వేతనం నుంచి సీఎంపీఎఫ్ 2022 జూన్ నుంచి ఖాతాలో జమ చేయటం లేదని టీయూసీఐ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్‌షావలీ అన్నారు. మంగళవారం ఇల్లెందులో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. 30 నెలలుగా సీఎంపీఎఫ్ లెక్కలు చూపకపోవటంతో కార్మికులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ప్రతీనెల సీఎంపీఎఫ్ లెక్కలు వెల్లడించాలని కోరారు. కార్మికులకు తగు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు డిమాండ్ డే

సింగరేణి(కొత్తగూడెం): రైతులు, కూలీలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రచారంలోకి తీసుకెళ్లేందుకు అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఐయూకేఎస్) ఆధ్వర్యంలో జనవరి 9న డిమాండ్ డే కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చర్ల రంగారెడ్డి, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కొత్తగూడెం కేంద్రంలో జిల్లా కార్యాలయ ఆవరణలో పోస్టర్లు ఆవిష్కరించారు. ముద్ద భిక్షం, నాయిని రాజు, సత్యం పాల్గొన్నారు.

12న స్వామి వివేకానంద జయంతి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలో ఈనెల 12న నిర్వహించనున్న స్వామి వివేకానంద జయంతి వేడుకలను విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ కోరారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాద పరిషత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మె విరమణ

కొత్తగూడెంఅర్బన్: విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో జరిపిన చర్చలు సఫలం కావడంతో తాత్కలికంగా సమ్మెను విరమిస్తున్నట్లు మంగళవారం డీఈఓ వెంకటేశ్వరచారికి తెలియజేస్తూ విరమణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అజ్మీర్ ఉత్సవాల స్వీట్లు పంపిణీ

ఇల్లెందు: పట్టణంలోని ప్రముఖ కూరగాయల వ్యాపారులు యాకూబ్ కుమారులు ఎస్‌కే జానీ, గౌస్, ఖాజా మంగళవారం అజ్మీర్ దర్గా షరీఫ్ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన స్వీట్లను పంపిణీ చేశారు. ఏటా ఉర్సు సందర్భంగా భక్తులకు వీరు మిఠాయిలు పంచుతుంటారు.

ఆర్టీసీలో రోడ్డు భద్రతపై అవగాహన

చుంచుపల్లి: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఎంవీఐ మనోహర్ హాజరై డ్రైవర్లు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్టీసీలో సురక్షితమైన డ్రైవింగ్ అందిస్తున్న డ్రైవర్లను అభినందించారు. డ్రైవర్లతో పాటు సామాన్య ప్రజలు సైతం రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మరింత సురక్షితంగా భద్రతమైన డ్రైవింగ్ కొరకు ఏకాగ్రతతో ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. డ్రైవర్లు మంచి ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొత్తగూడెంరూరల్: ప్రస్తుతం మారుతున్న కాలంలో పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్‌లో మంగళవారం సీఐ రాయల వెంకటేశ్వర్లు, ప్రకృతి ప్రేమికుడు విశ్వామిత్ర చౌహాన్‌తో కలిసి మొక్కలు నాటారు. మాట్లాడుతూ.. రెండేళ్లుగా విశ్వామిత్ర మొక్కలను నాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జయప్రకాశ్, బొబ్బల వెంకట్‌యాదవ్, బొల్లం ఉదయ్‌కుమార్ యాదవ్, వీరబాబు, సాగర్, బొబ్బల గణేష్, నాగేశ్వరరావుల పాల్గొన్నారు.

'కార్పొరేషన్'కు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం..



మాట్లాడుతున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: ఏజెన్సీ ప్రాంతాల్లో కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం సరికాదని తక్షణమే ఉపసంహరించుకోవాలని మాజీ కౌన్సిలర్ గోబ్రియా నాయక్, బీజేపీ నాయకులు రాంబాబు, సేవాలాల్ సేనా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం చిట్టిరామవరం తండాలో గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటును గిరిజనులుగా తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పూర్తిగా మైదాన ప్రాంతం కాదని, ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా రామవరం ఏజెన్సీ ప్రాంతాన్ని విలీనం చేసినట్లు చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాన్ని కలుపుతూ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం గిరిజనుల హక్కులను కాలరాయడమేనన్నారు. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికలను నిలిపివేయాలని హైకోర్టులో, నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్‌లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. చిట్టి రామవరం ప్రాంతాన్ని మున్సిపాలిటీ నుంచి తొలగించి పంచాయతీలో కలపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పూర్ణచందర్, రాజ్‌కుమార్, లచ్చిరాం, సక్రం, శ్రీను, కృష్ణ, నర్సింగ్, భూక్యా రవి పాల్గొన్నారు.

అటవీశాఖ నిర్బంధాన్ని నిరసిస్తూ ధర్నా

ఇల్లెందురూరల్: సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్ తండాలోని గుడిసెవాసులకు అటవీశాఖ నిర్బంధం విధించడాన్ని నిరసిస్తూ మంగళవారం గుడిసెవాసులు సీపీఎం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అటవీశాఖ ఇల్లెందు రేంజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రేంజ్ అధికారి ప్రసాద్‌కు అందజేశారు. నాయకులు నబీ, ఆలేటి కిరణ్ మాట్లాడుతూ.. గుడిసెవాసులకు తాగునీటి సరఫరాను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇతర శాఖల అధికారులు మౌలిక సౌకర్యాలు కల్పించే విధంగా అటవీశాఖ అధికారులు సహకరించాలని లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, ఖాదర్, వీరభద్రం, సుజాత, వెంకన్న, కమల, హసీనా, హుస్సేన్, విజయ, రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వండి..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో గిరిజనేతరుల పోడు భూములకు పట్టాలివ్వాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బాధిత రైతులతో కలిసి టేకులపల్లి తహసీల్దార్ నాగభవానీకి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామంలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన రైతులు ఐదు తరాలుగా పోడు సాగు చేసుకుంటూ జీవిస్తున్నట్లు చెప్పారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఈ రైతులకు పోడు పట్టాలు ఇచ్చే క్రమంలో భూములను సర్వే కూడా చేయడం జరిగిందని, క్లెయిమ్, మ్యాపింగ్ కూడా చేశారని పేర్కొన్నారు. అయినప్పటికీ గిరిజనేతరులు కావడం వల్ల ఫారెస్టు అధికారులు హరితహారం పేరుతో గతంలో భూములను స్వాధీనం చేసుకుని మొక్కలు నాటారని తెలిపారు. గతంలోనే భూములను లాక్కోవడం వల్ల జీవనాధారం కోల్పోయి ఇబ్బందులు పడుతుంటే ప్రస్తుతం ఉన్న కొద్ది భూమిని కూడా లాక్కునేందుకు సర్వే చేస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో బొమ్మెర్ల వరప్రసాద్, ఈసాల ఉపేందర్, రైతులు ఎజ్జు ప్రభాకర్, ఎజ్జు భాస్కర్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

కొత్తగూడెంఅర్బన్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు మంగళవారం నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా పోలీసులు చేపట్టే కార్యక్రమాలకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడే నేరస్తులు ఎక్కువగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలను వినియోగిస్తున్నారని, వాటిని అదుపు చేసేందుకే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జూలూరుపాడు: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని జూలూరుపాడు ఎస్సై బాదావత్ రవి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జూలూరుపాడులో పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ప్రజలకు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఎస్సై రవి అవగాహన కల్పించి, చైతన్య పరిచారు.

పాల్వంచరూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆటోడ్రైవర్లను రూరల్ ఎస్ఐ బి.సురేష్ సూచించారు. కిన్నెరసాని గ్రామ సెంటర్‌లో మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఎస్ఐ అవగాహన సదస్సు నిర్వహించారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాములు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

జూలూరుపాడు: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) నూతన సంవత్సర క్యాలెండర్లను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోడా కృష్ణ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడు హైస్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసరావు, ఎస్.శాంతకుమారి, ఎస్.గురుమూర్తి, పి.రామనాథం పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..



సూపర్‌బజార్(కొత్తగూడెం): డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం(టీఎస్‌జీఆర్ఈఏ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఈజీఆర్ వెస్లీ, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు ఎస్.ఆనందకుమార్ పాల్గొన్నారు.

ఒక సేల్స్‌మెన్‌కు మూడు షాపుల బాధ్యతలు

పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ (జీసీసీ)లో సేల్స్‌మెన్ల కొరత కారణంగా ఒకే వ్యక్తికి మూడు షాపుల బాధ్యతలు అప్పగించడంతో రేషన్ పంపిణీ సక్రమంగా జరగడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. పాల్వంచ గిరిజన సహకార సంస్థ బ్రాంచ్ పరిధి ఉల్వనూరు జీసీసీ సేల్స్‌మెన్ వెంకట్రావుకు మల్లారం, కిన్నెరసాని షాపులకు బాధ్యతలు కూడా కేటాయించారు. దీంతో ఆయన ఎక్కడా సరిగ్గా విధులు నిర్వర్తించలేని పరిస్థితుల్లో ప్రతినెల బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతోందని వినియోగదారులు చెబుతున్నారు. కొన్నాళ్ల క్రితం కిన్నెరసాని సేల్స్‌మెన్‌ను ములకలపల్లికి బదిలీ చేయగా, ఉల్వనూరు సేల్స్‌మెన్‌కు కిన్నెరసాని, మల్లారం బాధ్యతలు అప్పగించారు. అంతకుముందు చంద్రాలగూడెం సేల్స్‌మెన్‌కు కిన్నెరసాని బాధ్యతలు ఇచ్చినా ఇప్పుడు అందుకు విరుద్ధంగా నిర్ణయం తీసుకున్నారు.

ఈ నేపథ్యాన మూడు షాపుల్లో నెలలో కొన్నిరోజుల పాటు విధులు నిర్వర్తిస్తుండగా సమయానికి బియ్యం పంపిణీ జరగక, అటవీ ఉత్పత్తులను కొనుగోళ్లలోనూ జాప్యం జరుగుతోంది. ఈ విషయమై జీసీసీ మేనేజర్ లక్ష్మాజీని వివరణ కోరగా.. రెగ్యులర్ సేల్స్‌మెన్ల నియామకం జరిగే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

ఫుడ్ కోర్ట్ కమిటీ ఏర్పాటు



కమిటీ సభ్యులతో మెప్మా అధికారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలోని 35వ వార్డులోని కమిటీ హాల్‌లో స్ట్రీట్ వెండర్ (కొత్తగూడెం ఫుడ్ కోర్ట్ స్టాల్) సభ్యుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో మెప్మా పీడీ రాజేష్, స్థానిక కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి పాల్గొన్నారు. మాట్లాడుతూ... ఫుడ్ కోర్ట్ 20 స్టాళ్లలో 20 రకాల ఫుడ్ ఐటమ్స్ పెట్టాలని ఒకరు పెట్టింది మరొకరు పెట్టొద్దని సూచించారు. ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ఇందిరా మహిళా శక్తి పథకంతో పాటు వివిధ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. మహిళలను వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇందిరా మహిళ శక్తి పథకం రూపకల్పన చేసినట్లు చెప్పారు. మహిళల కోసం స్త్రీనిధి ఏర్పాటు చేసి బ్యాంకులతో అనుసంధానం సహా వివిధ మార్గాల ద్వారా ఆర్థిక సాయం అందజేయనున్నారని తెలిపారు. అనంతరం సభ్యులతో ఫుడ్ కోర్ట్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలు గడ్డపార వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, కార్యదర్శి కొండపాక వనజ, సహాయ కార్యదర్శి చెన్నమల్లు స్వర్ణ, కోశాధికారి తునికపాటి రాధిక, గౌరవ సలహాదారులుగా మునిగ సుజాత, బి.రజిత, ఎం.జానకిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ చంద్రశేఖర్, టీఎంసీ వెంకటేశ్వర్లు, సీఓలు మౌలాలి, శాంతకుమార్, సరిత, సమైక్య అధ్యక్షురాలు మునిగ సుజాత, ఆర్పి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.